క్లుప్తంగా

ఘనంగా కామాక్షిదేవి కల్యాణం



నాగులాపల్లిలోని కామాక్షిదేవి అమ్మవారు

మునగపాక:మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం కామాక్షిదేవి అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

మునగపాక: మండలంలోని గణపర్తి నుంచి కశింకోట మండలం జోగారావుపేట మధ్య పక్కారోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు శుక్రవారం మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ వినతి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రెండు గ్రామాల మధ్య పక్కారోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో ప్రయాణం సాగించేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తక్షణమే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శీరం నర్సింహమూర్తి తదితరులు

నక్కపల్లి: మండలంలో ఉపమాక శివారు సారిపల్లి పాలెంలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శీరం నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆలయ నిర్మాణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షలు విరాళంగా సేకరించి ఆలయం నిర్మించడానికి సంకల్పించినట్టు శీరం నర్సింహమూర్తి తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధికి భూమిపూజ



సాగునీటి కాలువల అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న ఏషియన్ పెయింట్స్ జీఎం చటర్జీ

మునగపాక:సాగునీటి కాలువల అభివృద్ధికి అవసరమయ్యే సహకారం అందిస్తామని ఏషియన్ పెయింట్స్ జీఎం మానిక్ చటర్జీ తెలిపారు. మండలంలోని పాటిపల్లి పంచాయతీ మంగళవరపుపేట, మునగపాకలో పలు చోట్ల కాలువలపై గేట్లు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ సహకారంతో సాగునీటి కాలువలపై గేట్లు,తలుపులు ఏర్పాటు చేస్తామన్నారు. నీటి వనరుల పునరుద్ధరణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు శ్రీజిత్ టినీ,మహేంద్ర వాద్వాని, కె.అనిల్‌కుమార్,ఉదయభాస్కర్,సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక:మలేరియా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తోటాడ పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి,సీహెచ్‌వో దేవకాంత,ఆరోగ్య సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, సీతా మహలక్ష్మి,ఎంఎల్‌హెచ్‌పీ యామిని ప్రియాంక,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డూ.. అదుపు లేకుండా..

అధికార కూటమి పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు హెచ్చుమీరుతున్నాయి. అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారు. ఆఖరికి దేవుడు పేరుతో ఉన్న భూములను కూడా వదలడం లేదు. కొండలను పిండిచేసి భారీగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు.



పాటిపల్లిలో పొక్లెయిన్‌తో పాటు గ్రావెల్ తరలించే వాహనాలు(ఫైల్)



పాటిపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రావెల్ తరలించేందుకు ఏర్పాటు చేసిన మార్గం

- పాటిపల్లిలో యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు
- రాత్రి సమయంలో జోరుగా తవ్వకాలు
- తూతూమంత్రంగా దాడులు చేస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. అధికార పార్టీకి చెందిన నాయకులకు గ్రావెల్ అక్రమ తరలింపు ప్రధాన వ్యాపారంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రావెల్ తరలింపునకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. గత కొద్ది రోజులుగా పాటిపల్లి పరిధిలో కొండను తవ్వేసి గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రతిఘటిస్తున్న సమయంలో తాత్కాలికంగా తవ్వకాలు నిలిపివేసినా మళ్లీ, కొన్ని రోజులు పోయిన తరువాత యథేచ్ఛగా కొండలను తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తూతూ మంత్రంగా దాడులు చేయడం మినహా శాశ్వత చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొండలను పిండి చేసి...

మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలోని పలు కొండలు అక్రమార్కులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి. పాటిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్, త్రిమూర్తుల ఆలయ సమీపంలో, చిన్నోడుపాలెం వద్ద చెరువు సమీపంలోనూ కొండలను పిండి చేసి, అక్రమార్కులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. రాత్రుల సమయంలోనే ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నారు.

ప్రతిఘటిస్తున్నా...

గ్రావెల్ తరలింపునకు అక్రమార్కులు యత్నిస్తున్నారన్న విషయం తెలియగానే గ్రామస్తులు వచ్చి అడ్డుకుంటున్నారు. మూడు రోజుల క్రితం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలోని ఆటస్థలాన్ని చదును చేసే క్రమంలో రాత్రి 9గంటల తరువాత అక్రమార్కులు కొండను తవ్వే మిషన్‌తో పాటు లారీలను అందుబాటులో ఉంచారు.అంతేకాకుండా గ్రావెల్ తరలించేందుకు అనువుగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు.విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని కొండను తవ్వేందుకు అనుమతులు ఎవరిచ్చారంటూ అక్రమార్కులను ప్రశ్నించడంతో చేసేది లేక వెనుతిరిగారు. తరువాత మళ్లీ తవ్వకాలు జరిపినట్టు తెలిసింది.


నిమ్మకు నీరెత్తినట్టుగా అధికారులు...

రాత్రుల సమయంలో పాటిపల్లి పంచాయతీ పరిధిలో కొండలను తవ్వేస్తున్నారంటూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. స్థానికుల నుంచి అక్రమార్కులకు ప్రతిఘటనలు ఎదురవుతున్న సందర్భాల్లో కొన్ని రోజులు తాత్కాలికంగా తవ్వకాలను నిలిపివేసి, మళ్లీ తరువాత కొండలను తవ్వేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి.



పాటిపల్లిలో గ్రామస్తుల ప్రతిఘటనతో వదిలేసిన గ్రావెల్ తవ్వే యంత్రం(ఫైల్)

పనులు అడ్డుకుంటున్నాం..



అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం.కొండలను తవ్వేస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల మేరకు తమ సిబ్బందిని సంబంధిత స్థలానికి పంపి పనులు నిలుపుదల చేస్తున్నాం. పాటిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని ఆట స్థలం చదును చేసేందుకు ప్రిన్సిపాల్ దరఖాస్తు చేసుకున్నారు.

– ఎస్.ఆదిమహేశ్వరరావు, తహసీల్దార్

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

మునగపాక:మండలంలోని తోటాడ,గవర్ల అనకాపల్లి గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం గ్రామ పెద్దలు భూమిపూజ చేశారు. ఎంతో చరిత్ర కలిగిన మరిడిమాంబ ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఇరు గ్రామాల పెద్దలు నూతన ఆలయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాదికి పండగను ఘనంగా నిర్వహించేలా నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,పెద్దలు కాండ్రేగుల శివ,పాలమరశెట్టి నాగేశ్వరరావు,దొడ్డి రమేష్,పాలమరశెట్టి మురళి,బుద్ద రమేష్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికుడు

కోటవురట్ల: మండలంలోని కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించారు. డ్రైనేజీల్లో పూడిక తీసి, బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, వీధుల్లో ఇష్టానుసారంగా చెత్తను వేయకుండా పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని సూచించారు. స్వచ్ఛ గ్రామం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

యోగాంధ్రపై వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి: యోగాంధ్రపై శుక్రవారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన ఈ పోటీలకు వివిధ పాఠశాలలనుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ప్రపంచ యోగాదినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు.

'బ్రాండిక్స్' నిర్లక్ష్యం వల్లే బస్సు ప్రమాదం

అచ్యుతాపురం రూరల్ : బస్సు ప్రమాదంపై బ్రాండిక్స్ యాజమాన్యం బాధ్యత వహించాలని యలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త తనకాల అనంతరావు అన్నారు. బ్రాండిక్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కృష్ణాపురం వద్ద బస్సు బోల్తాపడి మహిళా కార్మికులు తీవ్ర గాయాలకు గురయ్యారని చెప్పారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ కష్ణ చైతన్య

యలమంచిలి రూరల్:ఆటో డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలని ట్రైనీ డీఎస్పీ కష్ణ చైతన్య సూచించారు.శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం,యలమంచిలి పట్టణంలో రద్దీగా ఉండే రహదారుల పక్కన ఆటోలు నిలిపి ఉంచడం వంటివి చేయవద్దని చెప్పారు.ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆటోలు నడపాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపడం,మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దన్నారు.మారిన మోటారు వాహన నిబంధనలపై అవగాహన పెంచుకుని అందుకు తగినట్టుగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ బి. రామకష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గోకులపాడులో త్వరలో ఇంటింటికీ నీటి సరఫరా



రక్షితమంచినీటి పథకం ట్యాంకులోపలి భాగంలో నీరు వస్తున్న దృశ్యం



నూతనంగా ఏర్పాటుచేసిన బోరునుంచి వస్తున్న నీరు

ఎస్.రాయవరం: గోకులపాడులో త్వరలో ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత మంచినీటిని అందించనున్నట్టు తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు.తిమ్మాపురం శివారు గోకులపాడులో జేజే ఎల్‌ఎం పథకంలో రూ.68 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల రక్షిత మంచినీటి ట్యాంకు, మోటారు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.గత ప్రభుత్వ హయాంలోనే కుళాయిలు పూర్తిగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు ట్యాంకు,బోరు పనులు పూర్తయినట్టు చెప్పారు.శుక్రవారం ట్రయిల్ రన్ వేశామని అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు.త్వరలో నీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగంబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆషాదేవి

మునగపాక:పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా ఆశించిన దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ ఆషాదేవి తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చూచుకొండ,గణపర్తి గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం మంచిదన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పశుగ్రాస సాగులో యూరియా వాడకాన్ని తగ్గించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి,డీఆర్‌సీ ఏఈవో సాయి వాణి,సర్పంచ్‌లు దొడ్డి సూరప్పారావు, చదరం నాయుడు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్,రైతులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ ఎస్‌ఐ పైడి రాజు

అచ్యుతాపురం రూరల్ : అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెరైన్ ఎస్‌ఐ పైడిరాజు తెలిపారు. తంతడి వాడపాలెం గ్రామంలో ఆయన శుక్రవారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్రం మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు, అపరిచితులు తారస పడితే వెంటనే మెరైన్ పోలీసులకు, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1093కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ స్టేషన్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం



గోకులపాడులో కురుస్తున్న వర్షం

ఎస్.రాయవరం:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. గోకులపాడు, భీమవరం, వమ్మవరం, పెనుగొల్ల తదితర గ్రామాల్లో సాయంత్రం వర్షం పడింది. గత కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

మునగపాకలో..

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండవేడితో సతమతమవుతున్న ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు, మధ్యాహ్నం అరగంట పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఈ వర్షం ఖరీఫ్ పంటల సాగుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

గ్రంథాలయాలు మంచి నేస్తాలు



మాట్లాడుతున్న ప్రకాష్,సూరప్పారావు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విజేతలు



యలమంచిలిలో బహుమతులు పొందిన విద్యార్థులు



నక్కపల్లిలో బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో దేవరాయల్, ఎస్‌ఐ మల్లేశ్వరరావు

కోటవురట్ల: గ్రంథాలయాలు మంచి నేస్తాలని ఉపాధ్యాయుడు జవ్వాది నర్సింగరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంతో శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో నర్సింగరావు మాట్లాడుతూ గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. వేసవి సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించామని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ మదీనా, మాజీ సర్పంచ్ మాణిక్యం,విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక: వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గణపర్తి పెద్దలు ప్రకాష్, సూరప్పారావులు తెలిపారు. మండలంలోని గణపర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను శుక్రవారం వారు సందర్శించారు.దీనిలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను వృథాచేయకుండా అందుబాటులో ఉన్న పుస్తకాలను చదువుకుని విజ్ఞానం పెంచుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయాధికారి అప్పలనరసమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్:స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.విశ్రాంత ఉపాధ్యాయుడు వై .అప్పారావు,గ్రంథాలయ అధికారి వి.ఆనంద్‌లను సత్కరించారు.కార్యక్రమంలో పౌరసేవా సంఘం అధ్యక్షుడు పుల్లా వెంకట్రావు,పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఖాదీ సంస్థ సీఈవో ఐ.ఎస్. జవహర్, డి.అనూరాధ,జె.సత్యారావు,డి కాళిదాసు,టి. పాపారావు,ఆడారి పూరీ జగన్నాథం,షేక్ అబ్దుల్లా, కె. సూరిబాబు,ఆకెళ్ల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోడానికి గ్రంథాలయాలు దోహదం

నక్కపల్లి: విజ్ఞానాన్ని పెంచుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని చినదొడ్డిగల్లు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ అన్నారు. శుక్రవారం చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. చదుతో పాటు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు,సృజనాత్మకతను వెలికి తీసేకార్యక్రమాలు, సైక్లింగ్, యోగా, తదితర కార్యక్రమాలు నిర్వహించిన గ్రంథాలయాధికారి కె.జనార్ధన్‌ను అభినందించారు. బండారు చారిటబుల్ ట్రస్ట్ తరఫున సమకూర్చిన బహుమతులను విజేతలకు అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్‌క్లబ్ వ్యవస్థాపకుడు ఏడిద వెంకటరమణ, ఉపాధ్యాయుడు రంగబాబు,వీరబాబు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

అచ్యుతాపురం రూరల్ : విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారి దేవరాయల్ అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన పిల్లలకు శుక్రవారం స్థానిక గ్రంథాయంలో ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్‌ఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టుదలతో ఎటువంటి అడ్డంకులైనా అధిగమించవచ్చని చెప్పారు. అనంతరం గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావును అభినందించారు.

పాయకరావుపేట : స్థానికశాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బాలికల హైస్కూల్ హెచ్‌ఎం భవాని, తెలుగు ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు పలు అంశాలను బోధించిన వై.అచ్యుతరావు, యోగ మాస్టార్ ఈ.శ్రీనివాసరాజు, ఎస్.సీతారామమూర్తిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవత పాపారావు, ముత్యాల సూర్యనారాయణ, ఎస్.టి. సీతారామమూర్తి, తాళ్ళరావు, తేజోమూర్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు

మునగపాక:రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వీఏఏ తులసి తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు,ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, నూకప్పారావు,శేషు తదితరులు పాల్గొన్నారు.